# మంచి వార్త

## పక్షుల మనుగడకు రక్షణ చర్యలు



**జనాభా** రోజురోజుకూ ఇంతలంతలు అవుతున్నది. ఆవాసాలు.. నగరాలు, పల్లెలు ఎల్లలు దాటి విస్తరిస్తున్నాయి. పంటపొలాల్లో చెట్లు కరవవుతున్నాయి. అడవులు తరిగిపోతున్నాయి. అభివృద్ధి పథంలో కొండలు పిండిగా మారుతున్నాయి. దీంతో పక్షులు, వన్యమృగాల మనుగడ కష్టంగా మారుతున్నది. ఉత్తరాఖండ్ హిమాలయాల ఒడిలో ఒదిగిన రాష్ట్రం. ఉత్తుంగమైన ఈ పర్వతాలు రకరకాల చెట్లు, వాటిని ఆశ్రయించుకుని జీవించే పక్షులకు స్వర్గధామాలు. ఇక్కడ మొత్తం 700 రకాల పక్షి జాతులు ఉన్నాయని అంచనా. వీటిలో సుమారు 30 జాతుల మనుగడ ఇప్పటికే ప్రమాదంలో పడిపోయింది. దీంతో పక్షులకు రక్షణ కల్పించడానికి ఉత్తరాఖండ్ అటవీ విభాగానికి చెందిన పరిశోధక బృందం ముందుకువచ్చింది. పక్షుల ఆహారానికి, వాటి ఆవాసానికి అవసరమైన చెట్లు, పొదలు, తీగజాతుల పెంపకానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. పదేండ్ల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఉత్తరాఖండ్ అటవీ విభాగం పర్వత ప్రాంతాలను లక్ష్యంగా చేసుకున్నది. పక్షులు ఆహారం కోసం ప్రధానంగా ఆధారపడే చెట్లు, పొదలు, తీగజాతులను గుర్తించడానికి సిద్ధమైంది. ఈ క్రమంలో ఆ రాష్ట్ర అటవీశాఖ పక్షులను ఆకర్షించే కొన్ని చెట్లను గుర్తించింది. దేవదారు అడవుల్లో పెరిగే ఐవీ వైన్ అనే తీగ, బురాంశ్, హిసాలు, మెహల్, తేజ్‌పత్తా, కిల్‌మోడా, ఘూగ్రా చెట్లు ఈ కోవలో ముఖ్యమైనవి. అంతేకాకుండా క్రమం తప్పకుండా పక్షుల సర్వే చేయడానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. స్థానిక వృక్ష జాతుల వైవిధ్యాన్ని పెంచితే పక్షుల జనాభా దానంతట అదే పెరుగుతుందని అటవీ శాఖవారి అభిప్రాయం. ఈ దిశగా తమ ప్రయత్నం మంచి ఫలితాలు అందిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదనంగా పక్షుల ఆవాసాలను పెంచేదిశగా సిల్వర్ ఓక్, సెమాల్, బూరుగు, మర్రి జాతి చెట్లు, కర్పూరం, అశోక మొదలైన చెట్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నది. ఈ చెట్లు వివిధ పక్షి జాతులు నివసించడానికి అనువుగా ఉంటాయి. సువిశాల విశ్వంలో భూగోళానికే ప్రత్యేకమైనది జీవవైవిధ్యం. దాని పరిరక్షణకు నిబద్ధత చాటుకోవడం బుద్ధిజీవులుగా మనుషుల తక్షణావసరం.

## వైతాళికుల వాణి

మీ హృదయంలో ఓ పచ్చని చెట్టుకు చోటివ్వండి. పాట పాడేందుకు బహుశా ఏదైనా పక్షి రావొచ్చు!

• **లూయీస్ లోరీ**

(ప్రముఖ అమెరికన్ రచయిత్రి)

## క్యా సీన్ హై!

